క్లుప్తంగా

పోల్ చిట్టీల పంపిణీ



ముస్తాబాద్‌లో పోల్ చిట్టి అందిస్తున్న పంచాయతీ సిబ్బంది

ముస్తాబాద్: మండలంలో ఓటరు స్లిప్పులను పంపిణీ చేసినట్లు ఆర్ఐ శ్యామ్, ఎంపీడీవో రమాదేవి తెలిపారు. ఈనెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఓటరుకు పోల్ చిట్టీలను అందిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు హక్కు వినియోగించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు.

మండెపల్లిలో బాలల దినోత్సవం



స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో చిన్నారులు

తంగళ్లపల్లి: మండెపల్లి సరస్వతి విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు స్వాతంత్య్ర సమరయోధుల వేషధారణలో అలరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



కోనరావుపేట: కొలనూర్‌లోని మార్గదర్శి విద్యానికేతన్‌లో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. చిన్నారులు ఉపాధ్యాయులుగా మారి ఒక్కరోజు పాఠాలు బోధించారు. కరస్పాండెంట్ మండల చిరంజీవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పేరుకే పాలకవర్గం..!



వెలవెలబోతున్న మార్కెట్ యార్డు



మర్రిపల్లిలో స్థలం పరిశీలిస్తున్న ఏఎంసీ పాలకవర్గం(ఫైల్)

- కొలిక్కిరాని కొత్త మార్కెట్
- ప్రతిపాదనల్లోనే నూతన యార్డు
- మిగిలింది సంవత్సర కాలమే..

వేములవాడరూరల్: వేములవాడ వ్యవసాయ మార్కెట్ యార్డుకు జిల్లాలోనే అత్యధిక ఆదాయం వచ్చే యార్డుగా పేరుంది. పట్టణంలో ఉన్న ఈ యార్డు ఐదెకరాల స్థలంలో కొన్నేళ్లుగా కొనసాగుతోంది. ఈ మార్కెట్ స్థలం నుంచి వేములవాడ మున్సిపాలిటీకి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ కోసం రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వ ఆదేశాలతో అప్పటి పాలకవర్గం కేటాయించింది. ఇక మిగిలిన మూడెకరాల్లో ప్రస్తుతం యార్డు కొనసాగుతోంది. నూతన మార్కెట్ యార్డు నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. వేములవాడ మార్కెట్ యార్డును కొత్త హంగులతో నిర్మించేందుకు వేములవాడ మండలం మర్రిపల్లి గ్రామంలో 13 ఎకరాల 20 గుంటల స్థలాన్ని ప్రభుత్వం గత సంవత్సరం క్రితమే కేటాయించింది. దీనికి గాను ముందుగా గోదాం ఆఫీస్, ఇతర పనులు చేపట్టేందుకు ప్రభుత్వం రూ.2.60కోట్లు కూడా మంజూరు చేసింది. కానీ ఇప్పటివరకు అక్కడ ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు.

వెలవెలబోతున్న యార్డు

3సంవత్సరాలుగా ఎలాంటి కొనుగోళ్లు లేకపోవడంతో యార్డు వెలవెలబోతోంది. వేములవాడ పట్టణం, అర్బన్, రూరల్ మండలాల్లో ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు, పత్తి కొనుగోళ్లను సొసైటీ, సీసీఐ అధికారులు కొనుగోలు చేయడంతో యార్డులో ఎలాంటి ధాన్యం కొనుగోళ్లు లేక నిర్మానుష్యంగా మారింది.

గ్రేడ్–1 మార్కెట్‌గా పేరు

జిల్లాలో మొత్తం 10 మార్కెట్ యార్డులుండగా.. వేములవాడ మార్కెట్ యార్డుకు జిల్లాలోనే గ్రేడ్–1 మార్కెట్‌గా పేరుంది. సంవత్సరానికి అత్యధిక ఆదాయం వేములవాడ మార్కెట్ నుంచే ప్రభుత్వానికి వస్తోంది. కానీ ఈ మార్కెట్‌కు సిబ్బంది కొరత, సౌకర్యాల్లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యార్డు నుంచి దాదాపు కోటికి పైగా ఆదాయం వస్తున్నా.. పాలకులు మాత్రం ప్రత్యేక చొరవ తీసుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

సంవత్సరం గడిచినా..

మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గాన్ని ప్రభుత్వం 2022 నవంబర్ 11న ఏర్పాటు చేసింది. సంవత్సర కాలం పూర్తయినా ఇప్పటివరకు ఈ పాలకవర్గం పదవీకాలంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదనే ఆరోపణలున్నాయి. మర్రిపల్లి గ్రామ శివారులో నూతన మార్కెట్ కోసం పాలకవర్గం తీసుకున్న చర్యలు నామమాత్రంగానే ఉన్నాయి. రెండు సంవత్సరాల పదవీకాలంలో ఇప్పటికే సంవత్సరం పూర్తి కాగా.. ఇక మిగిలిన పదవీకాలం మరో సంవత్సరం మాత్రమే ఉంది. ఈ సంవత్సర కాలంలో నూతన మార్కెట్ పనులు పూర్తయ్యేనా అని ప్రతిపక్ష నాయకులు ప్రశ్నిస్తున్నారు.

పనులు చేపట్టాలి



పట్టణంలో ఉన్న మార్కెట్ స్థలాన్ని ఇతర శాఖలకు అప్పగించి కొనుగోళ్లు లేకుండా చేశారు. నూతన మార్కెట్ కోసం స్థలాన్ని కేటాయించినా నేటికీ అతీగతీ లేదు. దీంతో రైతులు సౌకర్యాల్లేక దళారులకు విక్రయించుకుంటున్నారు. ఇప్పటికైనా వెంటనే నూతన మార్కెట్ పనులు చేపట్టాలి.
– సోయినేని కరుణాకర్, సర్పంచ్, ఎదురుగట్ల

ఎన్నికల కోడ్‌తో..



నూతన మార్కెట్ నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి రూ.2.60కోట్లు మంజూరయ్యాయి. టెండర్ కూడా పూర్తయింది. ఈ సమయంలోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు ప్రారంభించలేదు. త్వరలోనే ప్రారంభిస్తాం.
– వెలుమ బాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్, వేములవాడ

పనులు ప్రారంభం కాలేదు



మర్రిపల్లి గ్రామంలో నూతనంగా మార్కెట్ కమిటీ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.2.60కోట్లు మంజూరు చేసింది. ఇప్పటివరకు ఎలాంటి పనులు చేపట్టలేదు. త్వరలోనే పనులు చేపడతాం.
– సత్యనారాయణ, మార్కెట్ కమిటీ కార్యదర్శి, వేములవాడ

చల్మెడకే మా మద్దతు

- రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్



వేములవాడ: సహచరులతో చాయ్ తాగుతున్న చల్మెడ

వేములవాడ: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల రజకులు బీఆర్‌ఎస్ పార్టీకే మద్దతు పలుకుతున్నామని రజక సంఘాల సమితి రాష్ట్ర చైర్మన్ అక్కరాజు శ్రీనివాస్ అన్నారు. చల్మెడ నివాసంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావుతో శనివారం సమావేశమయ్యారు. అన్ని గ్రామాల్లో రజకులతో మాట్లాడి అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేస్తామన్నారు. రజక సంఘాల సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దేవయ్య, మండలాల అధ్యక్షులు మొగిలి అంజయ్య, సుద్దాల నర్సయ్య, లింగంపల్లి గంగాధర్, లింగంపల్లి నర్సయ్య, భూమన్న, బాలయ్య, మహేష్ పాల్గొన్నారు.
చల్మెడ లక్ష్మీనర్సింహారావు తన ఎన్నికల ప్రచారంలో భాగంగా అలసి కాసేపు తన సహచరులతో కలిసి చాయ్ తాగుతూ కనిపించారు. చాయ్ సమయం అంటూ జనం ముచ్చటించారు.
పట్టణంలో చల్మెడ సతీమణి సునీల మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, ఆమె కుటుంబ సభ్యులు, మహిళలతో కలసి ప్రచారం చేశారు.
రుద్రంగి: ప్రత్యేక తెలంగాణ సాధించుకున్నాక రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, అభివృద్ధి కొనసాగాలంటే కారు గుర్తుకు ఓటెయ్యాలని రుద్రంగి జెడ్పీటీసీ గట్ల మీనయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో నాయకులతో కలిసి గడపగడపకు తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంటె రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు దయ్యాల కమాలకర్, నాయకులు గంగం మహేశ్, రాజేశం, నాయకులు పాల్గొన్నారు.



వేములవాడ: చల్మెడతో శ్రీనివాస్, నాయకులు

కోనరావుపేట: నిజామాబాద్, నిమ్మపల్లి, ఎగ్లాస్‌పూర్, మామిడిపల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. నాయకురాళ్లు కాకరకాయల మంజుల, చీటి సంధ్య, వినోద, నేరెళ్ల జ్యోతి తదితరులు పాల్గొన్నారు.
రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఒగ్గు ప్రబాకర్, నాయకులు మిర్యాల్‌కార్ హరీష్, జవ్వాజి అరవింద్, ఊరడి అరవింద్ బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సుద్దాల గ్రామానికి చెందిన జేఏసీ నాయకుడు ఉప్పుల ఆంజనేయులు, ఒద్యారపు శంకర్, దొబ్బల లక్ష్మణ్, ఊరడి కొమురయ్య, బొల్లు రాములు, బొడ్డు రమేశ్ తదితరులు బీఆర్‌ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావు సమక్షంలో చేరారు.
వేములవాడరూరల్: వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపల్లిలో ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ ఉపాధ్యక్షుడు గుడిసె మనోజ్, నల్ల సతీష్‌రెడ్డి, అనిల్, పురుషోత్తం, నరేష్, మధు, వెంకటేశం, తిరుపతి, స్వామి, సాయిబాబా, అనిల్, రాజు, ప్రకాశ్, మహేందర్, గణేశ్ పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు



గూడెంలో బోనాలతో మహిళలు

ముస్తాబాద్: గూడెం గ్రామంలో పోచమ్మ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాల్లో భాగంగా యాదవ సామాజిక వర్గం శనివారం బోనాలను ఘనంగా నిర్వహించింది. గొల్ల, కురుమలు ఇంటికో బోనంతో ఆలయానికి తరలివెళ్లారు. బైండ్ల కళాకారుల ఆటపాటలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్లతో మహిళలు పోచమ్మ ఆలయానికి వెళ్లి బోనాలు సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సెస్ మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు మందాడి రమేశ్, కురుమ సంఘం అధ్యక్షుడు బట్టు తిరుపతి, దుర్గయ్య, మందాడి వెంకట్రాజం, శ్రీశైలం, పెద్దమ్మల శ్రీనివాస్, ఉప సర్పంచ్ శాడ శ్రీనివాస్, సంతోష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువలు నిర్మించరూ..



రుద్రంగి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో డ్రైనేజీల్లేక మురుగు నీరు రోడ్లపై పారుతోంది. కాలనీ వాసులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నిసార్లు విన్నవించినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అటెన్షన్ ప్లీజ్



ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ముస్తాబాద్: ముస్తాబాద్‌లోని కూరగాయల మార్కెట్‌లో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉంది. 20ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్.. నేడు జనంతో రద్దీగా ఉండే ప్రదేశంలో ఉండిపోయింది. దారి పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండగా.. దాని చుట్టు దుకాణాలు వెలిశాయి. జనం ట్రాన్స్‌ఫార్మర్ చుట్టు పలు పనుల కోసం తిరుగుతున్నారు. ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని మార్కెట్ దుకాణాల యజమానులు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: విష్ణుతేజ, సెస్, ఏఈ, ముస్తాబాద్, సెల్ నెంబర్: 94408 14079

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

- కాంగ్రెస్ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్



వేములవాడఅర్బన్: మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడఅర్బన్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే మిడ్ మానేరు ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని కాంగ్రెస్ పార్టీ వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది శ్రీనివాస్ అన్నారు. చింతాల్‌ఠాణా, గుర్రవానిపల్లి, చీర్లవంచ, చంద్రగిరి గ్రామాల్లో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నర ఏళ్ల పాలనలో నిర్వాసితుల సమస్యలను పరిష్కరించక గాలికి వదిలేసిందన్నారు. సీఎం కేసీఆర్ ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.5.04 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికి నెరవేర్చలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇంటి స్థలం పట్టా ఇచ్చిన ప్రతి నిర్వాసిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు కింద రూ.5 లక్షలు అందిస్తామన్నారు. బీసీ బిడ్డను.. మీ కళ్ల ముందు పెరిగిన బిడ్డను.. నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానని అన్నారు. మండల అధ్యక్షుడు పిల్లి కనకయ్య, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాసరావు, పర్శరాములు, దేవరాజు, కత్తి కనకయ్య, రగుడు పర్శరాములు, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా ఆయన్ని గెలిపించండి

వేములవాడ: కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ సతీమణి ఆది వనజ వేములవాడ పట్టణంలోని 25వ వార్డు మార్కండేయనగర్‌లో గడపగడపకు ఎన్నికల ప్రచారాన్ని శనివారం నిర్వహించారు. మా ఆయన్ని గెలిపించాలని, వేములవాడ అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ మహిళలకు బొట్టు పెట్టి ఓట్లు అభ్యర్థించారు. ఆమె వెంట మహిళలున్నారు.



మరిమడ్లలో కాళ్లు మొక్కుతూ ఓటడుగుతున్న మల్లేశం

కాంగ్రెస్ ప్రచారం

కోనరావుపేట: మరిమడ్ల, నిమ్మపల్లి, మామిడిపల్లి, నిజామాబాద్‌లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. పుల్కం మల్లేశం, కుమ్మరి రాజ్‌కుమార్, కొమ్ము బాబు, పర్శరాములు, మహంకాళి శ్రీనివాస్, ఎల్లాల లింగారెడ్డి, ఎల్లాల రాంరెడ్డి, బుర్ర సాయి, మల్లేశం, శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు. నిజామాబాద్ గ్రామానికి చెందిన యువకులు సిర్రం దేవయ్య, లంబ పర్శరాములు, విక్కుర్తి ప్రశాంత్, కట్ల నాగరాజ్, వంగపెల్లి ప్రశాంత్, ఈర్ల నాగరాజు తదితరులు ఆది శ్రీనివాస్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

రాజకీయాల్లోకి మీకోసమే వచ్చా



ఓటు అభ్యర్థిస్తున్న డా.వికాస్‌రావు

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు

వేములవాడరూరల్: రాజకీయాల్లోకి డబ్బు సంపాదన కోసం రాలేదని, మీ కష్టసుఖాల్లో పాలుపంచుకొని సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని బీజేపీ అభ్యర్థి డా.చెన్నమనేని వికాస్‌రావు అన్నారు. తుర్కాషినగర్, ఫాజుల్‌నగర్, వట్టెంల, నమిలిగుండుపల్లి, నూకలమర్రి, ఎదురుగట్ల, చెక్కపల్లి, అచ్చన్నపల్లి, బాలరాజుపల్లి, వెంకటాంపల్లి, మర్రిపల్లి, నాగాయపల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో చదువుకున్న ఎందరో యువకులు ఉద్యోగాలు రాక నిరుద్యోగులుగా ఉంటున్నారన్నారు. రైతులు, మహిళలు నేటికీ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారికి నావంతుగా సహాయం చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చానని అన్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు జక్కుల తిరుపతి, ప్రధాన కార్యదర్శులు చెట్టిపల్లి రవికిషోర్, బూరుగుపల్లి పరమేశ్, ఉపాధ్యక్షుడు ఎగుర్ల అనిల్, నందగిరి రాహుల్, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిక

కోనరావుపేట: పల్లిమక్త గ్రామ సర్పంచ్ జిన్న అనిల్, బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సిద్దరవేణి పర్శరాములు బీఆర్‌ఎస్ పార్టీని వీడి బీజేపీలో చేరారు. శనివారం బీజేపీ అభ్యర్థి చెన్నమనేని వికాస్‌రావు, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఆధ్వర్యంలో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వారి వెంట నాయకులు గోపాడి సురేందర్‌రావు, జవ్వాజి తిరుపతిగౌడ్ ఉన్నారు. ధర్మారం గ్రామానికి చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ ఇప్ప రాములు, యువకులు బీజేపీలో చేరారు.



బీజేపీలో చేరిన పల్లిమక్త సర్పంచ్ అనిల్ తదితరులు

రాజీనామా

వెంకట్రావుపేటలో రెండో వార్డు సభ్యుడు కుమ్మరి దయాకర్ బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. మండల శాఖ అధ్యక్షుడికి లేఖ పంపినట్లు పేర్కొన్నారు.

గడపగడపకు బీజేపీ

మల్కపేటలో గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆకుల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు గ్రామంలోని ఇంటింటా తిరిగి కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై వివరించారు. నాయకులు బొల్లారం తిరుపతి, ఆరె రాజు, శ్రీధర్, భాను, కళ్యాణ్, జలేందర్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గామాతకు పూజలు



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని శ్రీదుర్గామాత ఆలయం వద్ద శనివారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు. వివిధ గ్రామాల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రావుల మల్లారెడ్డి, దుంపెన స్రవంతి, నాయకులు లక్ష్మారెడ్డి, బాల్‌రెడ్డి, రమేశ్, మంజుల, శిరీష తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ



బోయినపల్లి: మండలంలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు వేములవాడ రూరల్ సీఐ కృష్ణ కుమార్, ఎస్సై శ్రీకాంత్ పేర్కొన్నారు. వరదవెల్లి, జగ్గారావుపల్లి, రత్నంపేట, రామన్నపేట గ్రామాల్లో శనివారం పోలీస్ కవాతు నిర్వహించారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాలతో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ సత్తయ్య, రామస్వామి ఆర్మీ జవాన్లు పాల్గొన్నారు.

నివాసాల మధ్యే మురుగు నీరు

చిత్రకథ



ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలోని పలు కాలనీల్లో మురుగు నీరు ఏరులై పారుతోంది. జనావాసాల మధ్యే మురుగు నీరు చేరినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మురుగు నీటి కాలువల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని పలుమార్లు ప్రజలు అధికారులకు చేసిన విజ్ఞప్తులు బుట్టదాఖలయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.